17-12-2023 ప్రాత:మురళి ఓంశాంతి "అవ్యక్త బాప్ దాదా" రివైజ్ 06-03-97 మధువనం

"శివజయంతి యొక్క కానుక - శ్రమను వదిలి ప్రేమ అనే ఊయలలో ఊగండి"

ఈ రోజు స్వయం శివపిత నలువైపుల నుండి వచ్చిన తమ పిల్లలతో తమ జయంతిని జరుపుకోవడానికి వచ్చారు. స్వయం తండ్రి కలుసుకునేందుకు మరియు జరుపుకునేందుకు వచ్చారంటే పిల్లలది ఎంతటి భాగ్యము. ప్రపంచములోనివారైతే పిలుస్తూ ఉంటారు - రండి, ఎప్పుడు వస్తారు, ఏ రూపములో వస్తారు, ఆహ్వానిస్తూ ఉంటారు కానీ పిల్లలైన మీ విషయములో స్వయంగా తండ్రి జరుపుకునేందుకు వచ్చారు. ఇటువంటి విచిత్ర దృశ్యాన్ని ఎప్పుడూ స్వప్నములో కూడా ఆలోచించి ఉండరు, కానీ ఈ రోజు సాకార రూపములో జరుపుకునేందుకు పరుగు-పరుగున వచ్చి చేరుకున్నారు. తండ్రి కూడా నలువైపులా ఉన్న పిల్లలను చూసి హర్షితులవుతారు - వాహ్, సాలిగ్రామ పిల్లలూ వాహ్! వాహ్ సాకార స్వరూపధారి ఫరిశ్తాల నుండి దేవతలుగా కాబోయే పిల్లలూ వాహ్. భక్తులైన పిల్లలకు మరియు జ్ఞానీ ఆత్మలైన పిల్లలకు మధ్యన ఎంత వ్యత్యాసము ఉంది. భక్తులు భావన యొక్క అల్పకాలికమైన ఫలాన్ని పొంది సంతోషపడిపోతారు. వాహ్-వాహ్ యొక్క పాటలను పాడుతూ ఉంటారు, కానీ జ్ఞానీ ఆత్మలైన పిల్లలైన మీరు కేవలం కొద్దిపాటి అల్పకాలిక ఫలాన్ని పొందరు, కానీ తండ్రి నుండి పూర్తి వారసత్వాన్ని తీసుకుని వారసత్వానికి అధికారులుగా అవుతారు. కనుక భక్త ఆత్మలకు మరియు జ్ఞానీ ఆత్మలైన పిల్లలకు మధ్యన ఎంత వ్యత్యాసము ఉంది! శివజయంతిని భక్తులు కూడా జరుపుకుంటారు మరియు మీరు కూడా జరుపుకోవటానికే వచ్చారు కానీ జరుపుకోవటంలో ఎంత తేడా ఉంది! శివజయంతిని జరుపుకోవటానికే వచ్చారు కదా! పరుగు-పరుగున వచ్చారు. కొందరు అమెరికా నుండి, కొందరు లండన్ నుండి, కొందరు ఆస్ట్రేలియా నుండి, కొందరు ఆసియా నుండి ఎంత స్నేహంతో వచ్చి చేరుకున్నారు. ఇది తండ్రి జయంతితోపాటుగా పిల్లల జయంతి కూడా, కనుక తండ్రితోపాటు పిల్లల జయంతికి కూడా బాప్ దాదా నుండి శుభాకాంక్షలు, శుభాకాంక్షలు, శుభాకాంక్షలు. ఎందుకంటే ఈ సాకార ప్రపంచములో పిల్లలు లేకుండా బాబా ఒంటరిగా ఏ కార్యాన్ని చెయ్యలేరు. పిల్లలపై అంత ప్రేమ ఉంది. ఒంటరిగా చెయ్యనే చెయ్యలేరు. ముందుగా పిల్లలను నిమిత్తం చేస్తారు, ఆ తరువాత వెన్నెముకగా అయ్యి, కంబైండుగా అయ్యి, చేయించేవారిగా అయ్యి నిమిత్తంగా పిల్లల ద్వారా కార్యాన్ని చేయిస్తారు. సాకార ప్రపంచములో ఒంటరిగా, పిల్లలు లేకుండా ఉండటము బాబా ఇష్టపడరు. నిరాకారీ ప్రపంచములోనైతే పిల్లలైన మీరు బాబాను ఒంటరిగా వదిలేసి వెళ్ళిపోతారు. బాబా ఆజ్ఞతోనే వెళ్తారు కానీ సాకార ప్రపంచములో బాబా పిల్లలు లేకుండా ఉండలేరు. పిల్లలు తప్పకుండా తోడు ఉండాలి. తోడుగా ఉంటాము, తోడుగా వెళ్తాము అన్నది పిల్లల ప్రతిజ్ఞ కూడా కానీ నిరాకారీ ప్రపంచము వరకు.

పిల్లలందరికీ తండ్రి జయంతిని జరపాలనే ఉల్లాస-ఉత్సాహాలు ఎంత ఉన్నాయి అనేది బాప్ దాదా చూస్తున్నారు. అందుకే బాబా కూడా చూడండి, పిల్లల స్నేహములో మీతోపాటు సాకార శరీరాన్ని అద్దెకు తీసుకుని వచ్చి చెరుకున్నారు. దీనినే అలౌకిక ప్రేమ అని అంటారు. పిల్లలు బాబా లేకుండా ఉండలేరు మరియు బాబా పిల్లలు లేకుండా ఉండలేరు. ప్రేమ కూడా ఎంతగానో ఉంది, అలాగే ఎంతో అతీతంగా కూడా ఉంటారు, అందుకే బాబాకు అతీతము మరియు ప్రియము అనే మహిమ ఉంది. పిల్లలు బాబా కోసం అనేక రకాల కానుకలను తీసుకొచ్చారు, కార్డులు, వస్తువులు, మనసులోని ఉల్లాసముతో కూడిన ఉత్తరాలు ఏవేవైతే బాబా దగ్గరకు తీసుకొచ్చారో, వాటన్నింటి యొక్క మ్యూజియం ఈ రోజు వతనములో పెట్టడం జరిగింది. మీ మ్యూజియం సేవది మరియు బాబా మ్యూజియం స్నేహముది. కనుక అందరూ ఏటినైతే తీసుకొచ్చారో లేక పంపించారో, అందరి స్నేహ సంపన్న కానుకలు బాబా వద్ద ఇప్పుడు కూడా మ్యూజియంలో పెట్టి ఉన్నాయి. వాటిని చూస్తూ-చూస్తూ బాబా సంతోషిస్తూ ఉంటారు. వస్తువు పెద్దది కాదు కానీ ఎప్పుడైతే వస్తువులో స్నేహము నిండుతుందో అప్పుడు ఆ చిన్న వస్తువు కూడా చాలా గొప్పదిగా అవుతుంది. బాప్ దాదా వస్తువును చూడరు, కాగితపు కార్డును లేక ఉత్తరాన్ని చూడరు, కానీ అందులో నిండి ఉన్న హృదయపూర్వకమైన స్నేహాన్ని చూస్తారు, అందుకే బాబా వద్ద స్నేహము యొక్క మ్యూజియం ఉంది అని అన్నారు. ఇటువంటి మ్యూజియం మీ ప్రపంచములో లేదు. ఉందా ఇటువంటి మ్యూజియం? లేదు. బాబా ఒక్కొక్క ప్రేమపూర్వకమైన కానుకను చూస్తూ ఉంటే, ఆ కానుకను చూడగానే అందులో పిల్లల ముఖం కనిపిస్తుంది. మీ దగ్గర ఇలాంటి కెమేరా ఉందా? లేదు. కానుకలను చూస్తుంటే బాప్ దాదాకు ఒక శుభ సంకల్పం వచ్చింది, చెప్పమంటారా?

అది చేయాల్సి ఉంటుంది. చేస్తారా, సిద్ధంగా ఉన్నారా? ఆలోచించకూడదు.

బాప్ దాదాకు ఈ సంకల్పం వచ్చింది - ఈ కానుకలైతే బాబా వద్దకు చేరుకున్నాయి, కానీ వీటితోపాటు బాప్ దాదాకు మరొక కానుక కావాలి. మీ కానుకలు చాలా బాగున్నాయి కానీ బాప్ దాదాకు ఇంకొకటి కూడా కావాలి. మరి ఆ కానుకను ఇస్తారా? ఆ మాటకొస్తే ఈ స్మృతి చిహ్నాన్ని ఏదైతే జరుపుకుంటున్నారో, శివజయంతి అనగా ఏదో ఒకటి అర్పణ చేస్తారు. బలిహారమవుతారు. కావున బాప్ దాదా ఆలోచించారు, బలిహారమైతే పిల్లలందరూ అయ్యారు. బలిహారమయ్యారా లేక ఇప్పుడింకా కొద్ది-కొద్దిగా మీ వద్ద జాగ్రత్తగా పెట్టుకున్నారా? ఈ రోజున వ్రతము కూడా పెట్టుకుంటారు. కావున బాప్ దాదాకు సంకల్పము వచ్చింది, అదేమిటంటే పిల్లలు నడుస్తూ-నడుస్తూ అప్పుడప్పుడు కాస్త అలసిపోతారు, చాలా శ్రమను అనుభవం చేస్తారు లేదా నిరంతర యోగాన్ని జోడించటాన్ని కష్టంగా అనుభవం చేస్తారు. అయిపోతుందిలే అని ఆలోచిస్తారు... బాబాకు ధైర్యం చెప్తారు, ఓదారుస్తారు - మీరు చింతించకండి, అయిపోతుంది అని. కానీ బాప్ దాదాకు పిల్లల యొక్క అలసట లేక ఒంటరితనము లేక అప్పుడప్పుడు కొందరు కాస్త నిరాశకు కూడా లోనవుతారు, మా భాగ్యములో ఉందో, లేదో తెలియదు... అని అప్పుడప్పుడు ఆలోచిస్తారు, ఇది బాబాకు మంచిగా అనిపించదు. అన్నింటికంటే ఎక్కువగా బాబాకు పిల్లల శ్రమ మంచిగా అనిపించదు. యజమానులు కానీ శ్రమపడుతున్నారా! బాబాకు కూడా పిల్లలుగా మరియు యజమానులుగా ఉన్నారు. భగవంతునికి కూడా యజమానులు కానీ శ్రమపడుతున్నారా! ఇది మంచిగా అనిపిస్తుందా? వినటానికి కూడా మంచిగా అనిపించదు. కనుక బాబాకు ఇలా సంకల్పము కలిగింది - పిల్లలు పుట్టినరోజు కానుకనైతే తప్పకుండా ఇవ్వనే ఇస్తారు, మరి ఈ రోజున పిల్లలందరూ దీనినే ఎందుకు కానుక రూపములో ఇవ్వకూడదు. ఆ స్థూలమైన కానుకలు ఏవైతే ఇచ్చారో, అవి వతనములో ఎలాగూ ఇమర్జ్ అయ్యాయి, కానీ నిరాకారీ ప్రపంచములో ఆ కానుకలు ఇమర్జ్ అవ్వవు. అక్కడికైతే సంకల్పము అనే కానుక చేరుకుంటుంది. కనుకు బాబాకు - ఈ రోజు పిల్లల నుండి ఈ కానుకను తీసుకోవాలి అని సంకల్పము వచ్చింది. మరి ఈ కానుకను ఇస్తారా లేక ఇచ్చి మళ్ళీ అక్కడకు వెళ్ళి తిరిగి తీసేసుకుంటారా? మధుబన్ లో ఇచ్చింది మధుబన్ లో ఉంటుంది, మా దేశములో మా దేశములో ఉండేట్లుగా ఉంటాము అని అనరు కదా? పిల్లలు చాలా తెలివైనవారిగా అయిపోయారు. అది తిరిగి రావాలని మేము కోరుకోము కానీ అది వచ్చేస్తుంది అని బాబాకు చెప్తారు. అది వచ్చేస్తుంది, సరే, మీరెందుకు స్వీకరిస్తున్నారు? అది వచ్చేస్తుంది, నిజమే, కానీ మీకు ఇష్టం లేని వస్తువును ఎవరైనా మీకు బలవంతంగా ఇస్తే దానిని మీరు తీసుకుంటారా లేక తిరిగి ఇచ్చేస్తారా? తిరిగి ఇచ్చేస్తారు కదా? మరి ఎందుకు స్వీకరిస్తున్నారు? మాయ అయితే తిరిగి తీసుకువస్తుంది కానీ మీరు స్వీకరించకండి. ఇటువంటి ధైర్యము ఉందా? ఆలోచించి చెప్పండి. మళ్ళీ అక్కడకు వెళ్ళి - బాబా, ఏం చేయను, అనుకోలేదు కానీ అయిపోయింది అని అనవద్దు. అటువంటి ఉత్తరాలైతే వ్రాయరు కదా? మీ ధైర్యము మరియు బాబా సహాయము. ధైర్యాన్ని తగ్గనివ్వకండి, అప్పుడు చూడండి బాబా సహాయము లభిస్తుందా, లేదా. ధైర్యాన్ని పెట్టినట్లయితే బాబా సహాయము అవసరమైన సమయంలో లభిస్తుంది మరియు లభించవలసిందే, ఇది గ్యారంటీ అని అందరికీ అనుభవం కూడా ఉంది. ధైర్యము మీది, సహాయము బాబాది. మరి సంకల్పం ఏమిటి? ధైర్యం ఉందా, లేదా అని ముఖాలు చూస్తున్నారు! మీరు ధైర్యం ఉన్నవారే, ఎందుకంటే ఒకవేళ ధైర్యం లేకపోతే బాబాకు చెందినవారిగా అవ్వరు. బాబాకు చెందినవారిగా అయ్యారు అంటేనే ధైర్యం ఉంది అని ఋజువవుతుంది. కానీ ఒక చిన్న విషయాన్ని చేస్తున్నారు, అదేమిటంటే అవసరమైన సమయములో ధైర్యాన్ని కాస్త మర్చిపోతారు. ఎప్పుడైనా, ఏదైనా జరిగితే, అది జరిగిపోయిన తరువాత ధైర్యము, సహాయము గుర్తుకొస్తాయి. అవసరమైన సమయములో అన్ని శక్తులను, సమయ ప్రమాణంగా ఉపయోగించాలి, అటువంటివారినే జ్ఞాన స్వరూప ఆత్మలు, యోగ స్వరూప ఆత్మలు అని అంటారు.

బాప్ దాదాకు ఒక విషయంలో చాలా సంతోషంగా ఉంది, అది ఏ విషయమో తెలుసా? చెప్పండి. (చాలామంది వినిపించారు). అందరూ కరక్టుగా చెప్పారు, కానీ బాబా సంకల్పము వేరే ఉంది. మీరు చాలా గుహ్యమైనవి వినిపిస్తున్నారు, జ్ఞాన సంపన్నులైపోయారు కదా.

బాప్ దాదా దేనికి సంతోషిస్తున్నారంటే - చాలామంది పిల్లలు, మేము 108 మాలలోకి వస్తాము అని ఉత్తరాలు, చీటీలు వ్రాసారు. చాలా చీటీలు వచ్చాయి. బాప్ దాదా ఆలోచించారు - ఇంతమంది 108 మాలలోకి వస్తే 5 వరుసలతో కూడిన 108 మాలను తయారుచెయ్యవలసి ఉంటుంది. 5-6-7-8 వరుసల మాలను తయారుచెయ్యాలి కదా? ఎవరైతే ఇలా సంకల్పము చేసారో, లక్ష్యాన్ని పెట్టుకున్నారో చాలా మంచిది. కానీ ఈ సంకల్పాన్ని మధ్యమధ్యలో దృఢం చేస్తూ ఉండండి. ఢీలా అవ్వనివ్వకండి. మాయ వచ్చేసింది, ఇప్పుడిక మాలలోకి వస్తామో, రామో తెలియదు అనైతే అనరు

కదా! తెలియదు, తెలియదు... అని అనకండి. మీరు తెలుసుకున్నారు, మీరు మాలలోకి వచ్చేదే ఉంది. దృఢత అనే ముద్రను వేస్తూ ఉండండి - అవును, నేను 108 మాలలోకి రావాల్సిందే, ఏం జరిగినా సరే నా నిశ్చయమైతే చలించనిది, అఖండమైనది. ఇటువంటి చలించని, అఖండమైన నిశ్చయము ఉందా? అయితే మిమ్మల్ని కదిలించేందుకు మాయను పంపించమంటారా? వద్దా? భయపడుతున్నారా? మాయ మీకు భయపడుతుందా లేక మీరు మాయకు భయపడతారా? మాయ మీ తలుపులను చూస్తుంది - ఇక్కడ తెరిచి ఉందా, అక్కడ తెరిచి ఉందా అని చూసుకుంటుంది, వెతుకుతూ ఉంటుంది. మీరు గాభరా ఎందుకు పడతారు? మాయ అసలేమీ కాదు. మాయ అసలేమీ కాదు అని అనండి, అప్పుడది అసలేమీ కాకుండా అయిపోతుంది. మాయ రాలేదు, రాలేదు అని అనుకుంటే అది ఇక రాలేదు. ఏం చెయ్యాలి... ? అని అనుకుంటే మాయకు తలుపులు తెరిచినట్లు, ఆహ్వానించినట్లు. మంచి విషయము ఏమిటంటే - చాలామంది పిల్లలు 108 మాలలోకి వచ్చే ప్రతిజ్ఞను చేసారు. చేసారు కదా? ఎవరైతే - మేము 108 మాలలోకి వస్తాము అని అన్నారో వారు బాగా పైకి చేతులెత్తండి. బాగా డ్రిల్ చెయ్యండి. చాలా మంచిది, అభినందనలు. 108 మాలలోకి ఎంతమంది వస్తారు, మేమెక్కడ వస్తాము అని ఆలోచించకండి. ముందు నుండే లెక్కలు వేయడం మొదలుపెడతారు - దాదీ వస్తారు, దీదీ వస్తారు, దాదాలు కూడా వస్తారు, అడ్వాన్స్ పార్టీవారు కూడా వస్తారు, మా నంబరు వస్తుందో లేదో తెలియదు! బాప్ దాదా 8-10 వరుసల మాలను తయారుచేస్తారు, అందుకే మీరు ఈ విషయములో చింతించకండి అని బాప్ దాదా చెప్పారు. ఇతరులను చూడకండి, మీకు నంబరు తప్పకుండా లభించేదే ఉంది, ఇది బాబా ఇచ్చే గ్యారంటీ. మీరు పక్కకు తప్పుకోకండి. మాల మధ్యలో దారాన్ని ఖాళీ చేయకండి. ఒక పూస మధ్యలో నుండి విరిగిపోయినా, తొలగిపోయినా మాల మంచిగా అనిపించదు. కేవలము ఇది మాత్రం చెయ్యకండి, ఇకపోతే బాబా గ్యారంటీ ఇస్తున్నారు, మీరు తప్పకుండా వస్తారు.

ఈ రోజు జయంతిని జరుపుకోవటానికి వచ్చారు, మురళిని వినిపించటానికి రాలేదు. ఎవరెవరైతే ఉన్నారో వారందరూ మాలలోకి వచ్చేయండి, 108 మాలలోకి అందరికీ వెల్కమ్. భక్తి మార్గమువారు 108 మాలను తయారుచేసారు. బాప్ దాదా దానిని ఎంత పెద్దదిగా అయినా చెయ్యగలరు. కేవలము ఇందులో కానుకనైతే బాబా తప్పకుండా తీసుకుంటారు, కానుకను వదిలిపెట్టరు. ఇది చిన్నపాటి కానుకే, పెద్దదేమీ కాదు, ఎందుకంటే బాబా పిల్లలందరి 6 నెలల చార్టును చూసారు. ఏం చూసారు? ఒకవేళ పిల్లలెవరైనా కాస్త కింద-మీద అయినా, అచల స్థితి నుండి అలజడిలోకి వచ్చినా, అందుకు కారణము కేవలం 3 ముఖ్యమైన విషయాలు, ఆ మూడు విషయాలే రకరకాల సమస్యలుగా, పరిస్థితులుగా అయ్యి వస్తాయి. ఆ మూడు విషయాలు ఏమిటి?

అశుభము లేక వ్యర్థము ఆలోచించటము, అశుభము లేక వ్యర్థము మాట్లాడటము మరియు అశుభము లేక వ్యర్థము చెయ్యటము. ఆలోచించటము, మాట్లాడటము మరియు చెయ్యటము - ఇందులో చాలా సమయము వృథా అవుతుంది. ఇప్పుడు వికర్మలు తక్కువ అవుతున్నాయి, వ్యర్థము ఎక్కువవుతుంది. వ్యర్థము యొక్క తుఫాను కదిలించేస్తుంది. ముందుగా ఆలోచనల్లో వస్తుంది, తరువాత మాటల్లో, ఆ తరువాత కర్మల్లో వస్తుంది మరియు రిజల్టులో ఏం చూడటం జరిగిందంటే - కొందరికి మాటల్లో మరియు కర్మల్లో వ్యర్థం రాదు కానీ ఆలోచనల్లో చాలా వస్తుంది. తయారయ్యే సమయమేదైతే ఉందో అదంతా ఆలోచించడములోనే గడిచిపోతుంది. కనుక బాప్ దాదా ఈ రోజు ఈ మూడు విషయాలను - ఆలోచించటము, మాట్లాడటము మరియు చెయ్యటము, ఈ కానుకను అందరి నుండి తీసుకోవాలని అనుకుంటున్నారు. సిద్ధంగా ఉన్నారా? ఎవరైతే ఇచ్చేసారో వారు చేతులెత్తండి. ఈ చేతులెత్తిన వీడియోను బాగా తియ్యండి, అన్ని పక్కల నుండి తియ్యండి. చేతులు బాగా పైకి ఎత్తండి. డ్రిల్ చెయ్యరు, అందుకే లావు అయిపోతారు. అచ్చా, అందరూ దీనిని ఇచ్చేసారు. తిరిగి తీసుకోకండి. నోటి నుండి వచ్చేసింది, ఏం చెయ్యాలి అని అనకూడదు. నోటిపై దృఢ సంకల్పం అనే బటన్ పెట్టండి. దృఢ సంకల్పము అనే బటన్ అయితే ఉంది కదా? ఎందుకంటే బాప్ దాదాకు పిల్లలపై ప్రేమ ఉంది కదా. ప్రేమకు గుర్తు ఏమిటంటే ప్రేమ ఉన్నవారు కష్టపడుతుంటే చూడలేరు. ఆ సమయంలో బాప్ దాదా ఏమి ఆలోచిస్తారంటే బాప్ దాదా సాకారములో వెళ్ళి ఆ బిడ్డకు ఏదైనా చెప్పాలి అని, కానీ వారు ఆకారీ, నిరాకారీ రూపములో ఉన్నారు కదా. అందరూ పూర్తిగా శ్రమ పడటము నుండి దూరమై ప్రేమ అనే ఊయలలో ఊగుతూ ఉండండి. ప్రేమ అనే ఊయలలో ఊగుతూ ఉన్నట్లయితే శ్రమ సమాప్తమైపోతుంది. శ్రమను సమాప్తం చెయ్యాలి, సమాప్తం చెయ్యాలి అని ఆలోచించకండి. కేవలము ప్రేమ అనే ఊయలలో కూర్చుండిపోండి, శ్రమ దానంతట అదే సమాప్తమైపోతుంది. వదిలేందుకు ప్రయత్నించకండి. కూర్చునేందుకు, ఊగేందుకు ప్రయత్నము చెయ్యండి.

శివ జయంతి అనగా పిల్లల శ్రమ సమాప్తి అయ్యే జయంతి. అంతే కదా? బాబాకు పిల్లలపై నమ్మకము ఉంది. కొంతమంది పిల్లలు బాబా కూడా తెలియని విధంగా ఎలా బాబా నుండి పక్కకు వెళ్ళిపోతారో అర్థం కాదు. ఛత్రఛాయ కింద కూర్చుని ఉండండి. బ్రాహ్మణ జీవితము యొక్క అర్థము ఊగటము, మాయలో ఊగటము కాదు. మాయ కూడా ఊపుతుంది. అమృతవేళ చూడండి, మాయ ఎలా ఊపుతుందంటే, సూక్ష్మవతనములోకి వచ్చేందుకు బదులుగా, నిరాకారీ ప్రపంచములోకి వచ్చేందుకు బదులుగా నిద్రాలోకములోకి వెళ్ళిపోతారు. యోగము డబుల్ లైట్ గా చేస్తుంది అని అంటారు కానీ తల భారమైపోతుంది. కనుక మాయ కూడా ఊయలను ఊపుతుంది కానీ మాయ ఊయలలో ఊగకండి. అర్ధకల్పము మాయ ఊయలలో బాగా ఊగి చూసారు కదా. ఏం లభించింది? ఏమైనా లభించిందా? అలసిపోయారు కదా! ఇప్పుడు అతీంద్రియ సుఖమనే ఊయలలో ఊగండి, సంతోషమనే ఊయలలో ఊగండి, శక్తుల అనుభూతులనే ఊయలలో ఊగండి. మీకు ఎన్ని ఊయలలు లభించాయంటే అవి ఇక్కడి రాకుమారులు, రాకుమారీలకు కూడా ఉండవు. ఏ ఊయలలో కావాలంటే ఆ ఊయలలో ఊగండి. ఇప్పుడు ప్రేమ అనే ఊయలలో ఊగండి, ఇప్పుడు ఆనందము అనే ఊయలలో ఊగండి, ఇప్పుడు జ్ఞానము అనే ఊయలలో ఊగండి. ఎన్ని ఊయలలు ఉన్నాయి! లెక్కలేనన్ని ఉన్నాయి. కనుక ఊయల నుండి దిగిపోకండి. ఎవరైతే అల్లారుముద్దు పిల్లలు ఉంటారో, వారి గురించి తల్లిదండ్రులు ఏం కోరుకుంటారంటే - పిల్లల కాళ్ళు మట్టిలోకి వెళ్ళకూడదు. పిల్లలు ఒడిలో అన్నా ఉండాలి, ఊయలలో అన్నా ఉండాలి, తివాచిపై అన్నా ఉండాలి, మట్టిలోకి కాళ్ళు వెళ్ళకూడదు. ఇలానే ఉంటుంది కదా? మరి మీరు ఎంతటి అల్లారుముద్దు పిల్లలు! మీలాంటి అల్లారుముద్దు పిల్లలు మరెవరైనా ఉన్నారా? పరమాత్ముని అల్లారుముద్దు పిల్లలు ఒకవేళ దేహభానములోకి వచ్చినట్లయితే మరి దేహమంటే ఏమిటి? మట్టి కదా! దేహాన్ని ఏమంటారు? మట్టి, మట్టిలో కలిసిపోతుంది. మరి ఇది మట్టి కదా. మట్టిలో కాళ్ళు ఎందుకు పెడతారు? మట్టి మంచిగా అనిపిస్తుందా? కొంతమంది పిల్లలకు మట్టి మంచిగా అనిపిస్తుంది, కొంతమంది మట్టిని తింటారు కూడా. కానీ మీరు తినకండి, మట్టిలో కాళ్ళు కూడా పెట్టకండి. సంకల్పం వచ్చింది అంటే కాలు పెట్టడమని అర్థము. సంకల్పములో కూడా దేహ భానము రాకూడదు. ఆలోచించండి, గుర్తు పెట్టుకోండి - మేము ఎంతటి అల్లారుముద్దు పిల్లలము, ఎవరికి అల్లారుముద్దు పిల్లలము! సత్యయుగములో కూడా పరమాత్మునికి అల్లారుముద్దు పిల్లలుగా ఉండరు. దివ్య ఆత్మలకు అల్లారుముద్దు పిల్లలుగా ఉంటారు. కానీ ఈ సమయములో పరమాత్మ అయిన తండ్రికి అల్లారుముద్దు పిల్లలు. పిల్లలు ధైర్యమనే చేతితో కానుకను ఇచ్చారు, అందుకే బాప్ దాదా వారికి థ్యాంక్స్ చెప్తున్నారు, షుక్రియా, ధన్యవాదాలు. అచ్ఛా.

నలువైపుల ఉన్న అతి-అతి భాగ్యవంతులైన పిల్లలకు, ఎవరైతే స్వయం శివబాబాతో శివజయంతిని జరుపుకుంటున్నారో, అటువంటివారికి పదమాల రెట్లు ఏంటి, ఇంకా ఎంత ఎక్కువ చెప్పినా అది తక్కువే, ఇటువంటి మహా భాగ్యవంతులైన ఆత్మలకు, సదా బాబా ఆజ్ఞపై ప్రతి అడుగును వేసే బాబాకు స్నేహీ మరియు సమీప ఆత్మలకు, సదా యజమాని స్థితి అనే అచంచల ఆసన నివాసుల నుండి భవిష్య సింహాసన నివాసులుగా అయ్యే శ్రేష్ఠ ఆత్మలకు, సదా బాబాతోపాటు ఆనందంగా ప్రేమ అనే ఊయలలో ఊగుతూ వెంట వచ్చే పిల్లలకు, అటువంటి బాప్ దాదా యొక్క సహచరులైన పిల్లలకు బాప్ దాదా యొక్క పుట్టినరోజు శుభాకాంక్షలు మరియు ప్రియస్మృతులు, యజమానులందరికీ బాబా యొక్క నమస్తే.

వరదానము:- బ్రాహ్మణ జీవితములో సదా శ్రమ నుండి ముక్తులుగా ఉండే సర్వ ప్రాప్తి సంపన్న భవ

ఈ బ్రాహ్మణ జీవితములో దాత, విధాత మరియు వరదాత - ఈ మూడు సంబంధాలతో ఎంత సంపన్నంగా అవుతారంటే ఇక ఎటువంటి శ్రమ లేకుండా ఆత్మిక ఆనందములో ఉండగలుగుతారు. తండ్రిని దాత రూపములో స్మృతి చేసినట్లయితే ఆత్మిక అధికారీతనము యొక్క నషా ఉంటుంది. శిక్షకుని రూపములో స్మృతి చేసినట్లయితే, నేను ఈశ్వరీయ విద్యార్థిని అన్న భాగ్యపు నషా ఉంటుంది మరియు సద్గురువు ప్రతి అడుగులోనూ వరదానాలతో నడిపిస్తున్నారు. ప్రతి కర్మ కోసము ఇచ్చే శ్రేష్ఠ మతము వరదాత ఇచ్చే వరదానము. ఈ విధంగా సర్వ ప్రాప్తులతో సంపన్నంగా ఉన్నట్లయితే శ్రమ నుండి ముక్తులైపోతారు.

స్లోగన్:- బుద్ధి యొక్క తేలికదనము మరియు సూక్ష్మతయే అన్నింటికన్నా సుందరమైన వ్యక్తిత్వము.

సూచన:- ఈ రోజు మూడవ ఆదివారము, అంతర్జాతీయ యోగ దివసము, సాయంత్రము 6.30 నుండి 7.30 గం. వరకు సోదరీ-సోదరులందరూ యోగాభ్యాసములో ఇలా అనుభవము చెయ్యండి - తపస్వీ ఆత్మనైన నేను బీజరూపుడైన

శివబాబాతోపాటు కల్పవృక్షపు వేర్లలో విరాజమానమై ఉన్నాను. బీజరూపుడైన బాబా నుండి ప్రాప్తించిన సర్వ శక్తులూ నా నుండి మొత్తము కల్పవృక్షానికి మరియు ఆకుల రూపములో ఉన్న ఆత్మల వరకు చేరుకుంటున్నాయి, వీటి ద్వారా ప్రతి ఒక్కరూ దివ్య శక్తులను అనుభవము చేస్తున్నారు.